ధాన్యం కొనుగోళ్లకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు: డీసీఎస్‌వో

కరీంనగర్‌టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎక్కడైనా సమస్య ఏర్పడితే కంట్రోల్ రూమ్ నంబర్ 9154249727కు ఫోన్ చేస్తే త్వరగా పరిష్కరిస్తామని అన్నారు. ఈ సౌకర్యాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గ్రూప్-3 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



స్ట్రాంగ్ రూమ్‌లో పరీక్షా పత్రాలను భద్రపరిచి తాళం వేయిస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఈనెల 17,18 తేదీల్లో నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్షకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. హైదరాబాద్ నుంచి వచ్చిన గ్రూప్-3 పరీక్షా పత్రాలను ఉన్నతాధికారుల సమక్షంలో జడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ జిల్లాలో 26,415 మంది అభ్యర్థులు గ్రూప్-3 పరీక్షలు రాసేందుకు 56 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు పరీక్ష మొదలయ్యే సమయానికి గంట ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బ్యాగులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని తెలిపారు. బయోమెట్రిక్ హాజరు ఉన్నందున అభ్యర్థులు మెహందీ, టాటూలు పెట్టుకోవద్దని సూచించారు. అడిషనల్ కలెక్టర్ వెంట ఆర్డీవో మహేశ్వర్, సూపరింటెండెంట్ కాళి చరణ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 15: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 29,30 తేదీల్లో జిల్లా కేంద్రంలో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలుకుతోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు నేరవేర్చకపోతే ఆందోళనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల మండల కార్యదర్శి కొప్పుల శంకర్, సైదాపూర్ సీపీఎం మండల కార్యదర్శి గుండేటి వాసుదేవ్, నాయకులు కదిరి రమేష్, వడ్లరాజు, ఎండి హుస్సేన్ పాల్గొన్నారు.



సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

ఉదయం బడి.. మధ్యాహ్నం సర్వే

- సమగ్ర సర్వే విధుల్లో టీచర్లు, అంగన్‌వాడీలు
- ఒంటి పూట తరగతుల నిర్వహణ
- పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తగ్గుతున్న విద్యార్థుల హాజరు
- పిల్లల భవిష్యత్‌పై తల్లిదండ్రుల ఆందోళన

కరీంనగర్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వేతో ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రభావం పడుతోంది. ఈనెల 6 నుంచి ప్రారంభమైన సమగ్ర సర్వేకు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలను ఎన్యూమరేటర్లుగా నియమించారు. దీనితో ఎన్యూమరేటర్లుగా విధులు నిర్వహిస్తున్న పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఒంటిపూట నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనితో ఆయా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం అందించి ఇళ్లకు పంపిస్తున్నారు. ఈనెల 30వ తేదీ వరకు సర్వేకు టీచర్లు, అంగన్ వాడీలను వినియోగిస్తుండడంతో చదువులు ముందుకు సాగవని, దీని ప్రభావం తమ పిల్లల భవిష్యత్‌పై పడుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.



సర్వే స్టిక్కర్‌ను ఇంటికి అంటిస్తున్న సిబ్బంది

- **గ్రామాల్లో వరి కోతలతో నత్తనడకన సర్వే**

ఒంటి పూట బడులకు వెళ్తున్న ఉపాధ్యా యులు కూడా సర్వేపై నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వరి కోతలు, ధాన్యం అమ్ముకునే ఈ సమయంలో రైతు కుటుంబాల ఇళ్లకు వెళితే మధ్యాహ్నం తాళం వేసి ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనితో సర్వే చేయలేక పోతున్నామని గ్రామీణ ప్రాంతాల టీచర్లు వాపోతున్నారు. అర్బన్ ప్రాం తాల్లో ప్రజలు ఇళ్లలో ఉండడం లేదని, ఉదయం, సాయంత్రం వెళితే తప్ప సర్వే ముందుకు సాగడం లేదని పేర్కొంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా పిల్లల సంఖ్య తగ్గుతోందని చెబుతున్నారు. ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, ఇతర అధికారులు కూడా సర్వేకు వెళ్తుండడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో సర్వే కూడా

మిగతా 8వ పేజీలో....

- **30శాతం మంది గైర్హాజరు**

కొంత మంది తల్లిదండ్రులు ఒంటి పూట బడులకు, చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించడం లేదు. దీనితో సర్వే ప్రారంభమైన రోజు నుంచి విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని, ఇప్పటికే 30 నుంచి 40శాతం మంది విద్యార్థులు గైర్హాజరవుతున్నారని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించి బడీడు పిల్లలను, బడి మానేసిన పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియంతో పాటు ఇంగ్లీష్ భాషల్లో విద్యాబోధన చేస్తున్నా కొంత మంది తల్లిదండ్రులు ప్రైవేట్ విద్యాసంస్థల వైపే మొగ్గు చూపుతున్నారు.

సమాజ సేవలో 'సదిశ'

- పేద విద్యార్థులకు ఉచితంగా ఇంటర్ విద్య
- యువ ఇంజనీర్ ఆదర్శం

-చొప్పదండి, ఆంధ్రజ్యోతి

7వ పేజీలో..

పాదచారుల పైకి దూసుకువెళ్లిన కారు

- ప్రమాదంలో ముగ్గురి మృతి
- మరొకరికి గాయాలు

-తిమ్మాపూర్, ఆంధ్రజ్యోతి

6వ పేజీలో..

అడవి బిడ్డల ఆరాధ్యదైవం బిర్సా ముండా

- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున

-గణేష్‌నగర్, ఆంధ్రజ్యోతి

8వ పేజీలో..

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

- జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నరెడ్డి

-రామడుగు, ఆంధ్రజ్యోతి

8వ పేజీలో..

వైభవంగా కార్తీక పౌర్ణమి





పాతబజార్ గౌరీశంకరాలయంలో గర్భాలయంలో శివలింగానికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు, దీపాలు వెలిగించి మొక్కుతున్న యువతులు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు ఉదయం నదీ స్నానాలు ఆచరించారు. అనంతరం సత్యనారాయణ స్వామి వ్రతాలు, దీపదానాలు చేశారు. పలు ఆలయ ప్రాంగణాలు భక్తులతో కిటకిటలాడాయి. తులసి కోటల వద్ద, ఆలయాల్లో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. జ్వాలా తోరణం, ఆకాశదీపాది పూజల్లో పాల్గొన్నారు. ఆలయాల్లో, ఇళ్ళలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఆలయాల్లో అధికారులు, నిర్వాహకులు, సిబ్బంది భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

- **కన్నుల పండువగా జ్వాలా తోరణం**

కరీంనగర్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని దుర్గా భవానీ దేవాయలంలో కార్తీక మాసం పూజల్లో విశిష్టమైన జ్వాలా తోరణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి, వేద పండితులు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించగా ఆలయ మాడ వీధుల్లో కోలాటాలు, భజనలతో అమ్మవారిని పల్లకిలో ఊరేగించి జ్వాలా తోరణ ప్రవేశం చేయించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, విశేష పూజలు చేసి విశేష హారతులు ఇచ్చారు. సాయంత్రం జ్వాలాతోరణోత్సవం అనంతరం సహస్ర దీపారాధన, అమ్మవారికి అభిషస్త్రకం, విశేష పూజలు చేసి విశేష హరతులు, ప్రత్యేక పూజలు, ఉయ్యాల సేవలను నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, కమిటీ బాధ్యులు వేముల వాడ ద్రోణాచార్య నీరుమల్ల తిరుపతి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

- **ఆలయాల్లో వ్రతాలు, దీపారాధనలు**



నగునూరులో జ్వాలా తోరణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు



రాంనగర్ రమాసత్యనారాయణస్వామి ఆలయంలో వ్రతాల్లో పాల్గొన్న దంపతులు

- **సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు**

కరీంనగర్ కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ఆలయాల్లో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అశోక్‌నగర్ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉచితంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పారువెల్ల ఫణిశర్మ వైదిక నిర్వహణలో జరిగిన వ్రతాల్లో 130 మంది దంపతులు పాల్గొన్నారు. వెయ్యి మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. వ్రతాల్లో ఆలయ అధ్యక్ష కార్యదర్శులు చిట్టుమల్ల శ్రీనివాస్, కాచం రాజేశ్వర్, కోశాధికారి బొల్లం లింగమూర్తి, సంకటహర చతుర్థి కన్వీనర్ రాచమల్ల భద్రయ్య పాల్గొన్నారు. బొమ్మకల్ రోడ్ యజ్ఞవరాహక్షేత్రంలోని రమాసత్యనారాయణస్వామికి జరిగిన అభిషేక పూజలు, సామూహిక వ్రతాల్లో సర్వవైదికసంస్థానంట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాదశర్మ, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. రాంనగర్ రమాసత్యనారాయణస్వామి ఆలయంలో వ్రతాలు, అన్నదానం జరిగాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి హరిశంకర్, ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు మల్లికార్జున రాజేందర్, చైర్మన్ చల్ల హరికృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురునానక్ జయంతి



గురుద్వారాలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గురుద్వారాలో శుక్రవారం గురునానక్ దేవ్‌జీ మహారాజ్ జయంతిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కొన్ని రోజులుగా గురుద్వారా ప్రబంధక్ కమిటీ ఆధ్వర్యంలో గురువాణి, ప్రత్యేక కీర్తనలు, నగర వీధులగుండా ప్రభాత్‌ఫేరి నిర్వహించారు. జయంతి సందర్భంగా శుక్రవారం సిక్కు మత గురువులు ప్రత్యేక ప్రార్థనలు, కీర్తనలు ఆలపించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ యాదగిరి సునీల్‌రావు, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు వేర్వేరు సమయాల్లో హాజరై ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సర్దుల్‌సింగ్, కిషన్‌సింగ్‌తో పాటు రణబీర్‌సింగ్, బల్‌బీర్‌సింగ్, సిక్కు మతస్థులు పాల్గొన్నారు. పార్చ్యూన్ హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

- **కరీంనగర్ అర్బన్:** నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సర్దార్ ధన్నాసింగ్ ఆహ్వానం మేరకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కరీంనగర్‌లోని గురుద్వారాను సందర్శించారు. ఈసందర్భంగా సిక్కు మత గురువులు ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు.

ప్రొఫెసర్ సాయిబాబా మృతికి కేంద్రమే బాధ్యత వహించాలి

హుజూరాబాద్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ సాయిబాబా మృతికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని పాత్రికేయుడు వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సాయిబాబా సంస్మరణ సభను ప్రజా సంఘాల జేఏసీ నాయకుడు ఆవునూరు సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్యాయంగా ఉపా చట్టం కింద నిర్బంధించారన్నారు.కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, తెలంగాణ జన సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముక్కెర రాజు, ప్రొఫెసర్ సాయి బాబా కుమార్తె మంజీరా, ప్రజా సంఘాల నాయకులు పొడిశెట్టి వెంకటరాజం, వేల్పుల రత్నం, జయన్న ఫౌండేషన్ నాయకుడు జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్ గీతం.. గర్షకుర్తి విద్యార్థులు అభినయం

- **వైరల్ అవుతున్న వీడియో**



కలెక్టర్ పాటకు చిన్నారుల నృత్యం

గంగాధర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ పమేలా సత్పతి రచన, గానం చేసిన గీతానికి గంగాధర మండలం గర్షకుర్తి విద్యార్థుల అభినయం వీడియో జిల్లాలో వైరల్ అవుతోంది. కలెక్టర్ పమేలా సత్పతి ఇటీవల గంగాధర మండలం గర్షకుర్తి పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా తాను పాడిన గీతాన్ని పాఠశాల ఉపాధ్యాయులకు వినిపించి చిన్నారులను పాటలోని వచనాలకు అనుగుణంగా అభినయంతో వీడియో చేయించాలని సూచించారు. దీంతో గర్షకుర్తి చిన్నారులను అభినయాన్ని ప్రధానోపాధ్యాయురాలు క్రిష్ణవేణి వీడియో తీసి పంపించారు. ఇంగ్లీష్ వర్ణమాలలోని ఏ నుంచి జడ్ వరకు అక్షరాలపై పాడిన పాటకు అనుగుణంగా చిన్నారులు అభినయం చేసిన వీడియోను చిల్డ్రన్స్ డే సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. కలెక్టర్ పాడిన గీతానికి గర్షకర్తి చిన్నారులు చేసిన అభినయం వీడియోను చూసిన వారు అభినందిస్తున్నారు.

అర్బన్ బ్యాంకు అభివృద్ధికి సమష్టి కృషి

- **బ్యాంకు అసోసియేట్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి**



సహకార జెండాను ఆవిష్కరణలో పాల్గొన్న అర్బన్ బ్యాంకు పాలకవర్గం

కరీంనగర్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు అభివృద్ధికి పాలకవర్గం, ఉద్యోగులు సమష్టిగా కృషి చేస్తున్నారని బ్యాంకు అసోసియేట్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బ్యాంకు ఆవరణలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సహకార పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యుల సహకారంతో బ్యాంకు అభివృద్ధి పథంలో ముందుకెళ్తోందన్నారు. ఇటీవల గంగాధరలో కొత్తగా బ్యాంకు శాఖను ప్రారంభించామ తెలిపారు. త్వరలోనే హుస్నాబాద్, చొప్పదండిలో కూడా బ్యాంకుశాఖలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మడుపు మోహన్, ముక్క బాస్కర్, మహ్మద్ కలీమ్‌ఖాన్, బీరం ఆంజనేయులు, రేగొండ సందీప్, మూల లక్ష్మీరవీందర్‌రెడ్డి, ఎ.విద్యాసాగర్, లక్ష్మణ్‌రాజు, మంగి రవీందర్, బ్యాంకు సీఈవో నునుగొండ శ్రీనివాస్, సహకార శిక్షకుడు ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పాదచారుల పైకి దూసుకువెళ్లిన కారు

- ప్రమాదంలో ముగ్గురి మృతి- మరొకరికి గాయాలు


నుజ్జునుజ్జయిన కారు


వెంకట్‌రెడ్డి(ఫైల్)

తిమ్మాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారు రాజీవ్ రహదారిపై శుక్రవారం రాత్రి పక్క నుంచి నడుచుకుంటూ వెళుతున్న ముగ్గురు బిహార్ కూలీలపైకి వెనుక నుంచి వచ్చిన కారు దూసుకు వెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వలస కూలీలు సంఘటన స్థలంలోనే మృతి చెందారు. కారు నడుపుతున్న వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎల్ఎండీ పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో గల ఓ రైస్ మిల్లులో బిహర్ కూలీలు ధీరజ్‌కుమార్(23), సికిందర్ మండల(25), లక్ష్మణ్‌కుమార్ కొంత కాలంగా పని చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం పనుల నిమిత్తం బయటకు వచ్చి తిరిగి రైస్ మిల్లుకు రాజీవ్ రహదారి పక్క నుంచి నడస్తూ వెళుతున్నారు. ఆ సమయంలో కరీంనగర్ నుంచి హైదారాబాద్ వెళుతున్న కారు అతివేగంగా నడుచుకుంటూ వెళుతున్న వారిపైకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో ఎ ధీరజ్‌కుమార్(23), సికిందర్ మండల(25) తీవ్ర గాయాలతో సంఘటన స్థలంలోనే మృతి చెందారు. వారితో పాటు న్న లక్ష్మణ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. అతి వేగంగా పాదచారులపైకి దూసుకు వెళ్లిన కారు పక్కనే ఉన్న రెండు పిల్లర్లకు ఢీకొని నిలిచిపోయింది. కారు నడుపుతున్న సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన తాడూరు వెంకట్‌రెడ్డి(53)కి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెంకట్ రెడ్డి కరీంనగర్ వెళ్లి తిరిగి ఇంటికి వెళుతుండగా కొత్తపల్లి గ్రామ శివారులో చీకటిలో ఈ ప్రమాదం చోటుకుంది. మృతి చెందిన ఇద్దరు బిహార్ కూలీలకు వివాహం కాలేదు. తాడూరు వెంకట్‌రెడ్డికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ముగ్గురు కూతుళ్లకు పెళ్లిళ్లు చేశాడు. ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ ఎస్సై తాండ్ర వివేక్, బ్లూకోల్ట్స్ సిబ్బంది సురేష్, మల్లి కార్జున్ క్షతగాత్రులను స్థానికుల సహాయంతో ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివేక్ తెలిపారు.

మద్యం మత్తులో యువకుడి వీరంగం

- ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం


ధ్వంసమైన ఆర్టీసీ బస్సు అద్దం


మద్యం మత్తులో యువకుడు

కోరుట్ల రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పైడిమడుగు గ్రామంలో మద్యం మత్తులో ఓ యువకుడు శుక్రవారం వీరంగం సృష్టించి ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం చేశాడు. కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పైడిమడుగు మీదుగా రాయికల్‌కు మధ్యాహ్నం సమయంలో బయల్దేరింది. పైడిమడుగు గ్రామ పంచాయతీ సమీపంలోని బస్టాండ్ వద్ద ప్రయాణికులను ఎక్కించుకున్న డ్రైవర్ బస్సును రాయికల్ వైపు తీసుకెళ్లాడు. మార్గమధ్యలో బస్సు వెళుతున్న సమయంలో ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై వచ్చి బస్సును అడ్డుకున్నాడు. గమనించిన బస్సు డ్రైవర్ బస్సును పక్కకు నిలిపాడు. మద్యం మత్తులో ఉన్న యువకుడు డ్రైవర్ వద్దకు వచ్చి దురుసుగా ప్రవర్తించాడు. బస్సు ఇంతవేగంగా నడుపుతావా అంటూ అక్కడే ఉన్న బండరాయితో బస్సు అద్దం పగలగొట్టాడు. బస్సులో ఉన్న ప్రయాణికులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో వారిపైనా దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడాడు. అక్కడకు చేరుకున్న గ్రామస్థులు వారించి యువకుడిని అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు. గ్రామానికి చెందిన ప్రశాంత్ అనే యువకుడు దాడి చేసినట్లు బస్సు డ్రైవర్, కండక్టర్ కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లిలో శుక్రవారం పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాల య్యాయి. ఇంటి ముందు ఉన్న చిన్నారి లాస్య బాలుడు విక్కీ, వృద్ధురాలు వజ్రవ్వపై పిచ్చికుక్క ఒక్కసారిగా దాడి చేసింది. వెంటనే ముగ్గురిని కుటుంబసభ్యులు మండల కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా కుక్కల నుంచి కాపాడాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పాలకుర్తి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్నూర్ గ్రామానికి చెందిన పొన్నం రాము(36) మూడేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల లంగ్ ఇన్‌ఫెక్షన్ కావంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించగా శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ సేవసమితి ఛైర్‌పర్సన్ మనాలిఠాకూర్ 12 వేల రూపాయలతో అంబులెన్స్ మాట్లాడి స్వగ్రామానికి మృతదేహం తెప్పించే ఏర్పాట్లు చేశారు. రాముకి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి


మాట్లాడుతున్న మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పట్ట ణ శివారులోని అర్బన్ హౌజింగ్ కాలనీలో క్రీడా ప్రాంగణం వెనుక గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఆయన మాట్లా డుతూ పక్క సమాచారం మేరకు క్రీడా ప్రాంగణం వె నుకల ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించ గా వారిని తనీఖీ చేశారు. వారి వద్ద కవర్లో ఉన్న నిషే ధిత గుట్కాను పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి అమ్ముతున్న పట్టణానికి చెందిన పోతు అక్షయ్, బండి సాయిరాంలను విచారించగా నిజామాబాద్ రైల్వే స్టేషన్ నుండి గుర్తు తెలియని వ్యక్తి వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి 500 చొప్పున అమ్మేందుకు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుచనున్నట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలో ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, మల్లాపూర్ పరిధిలో ఎవరు గంజాయి సమాచారం ఇవ్వాలని కోరారు. గంజాయి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఎస్ఐ చిరంజీవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి..

నటుడిగా, రచయితగా, కవిగా, గాయకుడిగా రాణిస్తున్న దామెర శంకర్

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన దామెర శంకర్ విద్యార్థి దశ నుంచే నటుడిగా, కవిగా, రచయితగా, గాయకుడిగా రాణిస్తున్నారు. అప్పట్లో ఒకవైపు సింగరేణిలో కార్మికుడిగా పనిచేస్తూనే, కోల్‌బెల్ట్ ప్రాంతంలోని పలు అంశాలపై టెలీఫిల్మ్‌లు రూపొందించారు. ఎన్నో పౌరాణిక నాటకాల్లో నటించిన దామెర శంకర్ 1960లోనే గవర్నర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఉద్యోగ విరమణ పొందిన దామెర శంకర్ ఇప్పటికీ 81 ఏళ్ల వయసులో తనకున్న కళను నలుగురికి పంచుతూ కోల్‌బెల్ట్ ప్రాంతంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.


సినీ నటులు రాజేంద్రప్రసాద్, తనికెళ్ల భరణి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న దామెర శంకర్

కళ్యాణ్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖని మార్కండేయ కాలనీ చెందిన దామెర శంకర్ విద్యార్థి దశ నుంచే నటుడిగా, రచయితగా, కవిగా రాణించారు. వృత్తిరీత్యా సింగరేణి కార్మికుడైన శంకర్ నాటక రంగంపై మక్కువతో అనేక నాటికలను ప్రదర్శించడంతో పాటు సినీ పాటలను కూడా రచించారు. 1962లో జనరల్ మజ్దూర్ కార్మికుడిగా సింగరేణిలో చేరిన శంకర్ కోల్‌బెల్ట్‌లో జరిగిన పలు సంఘటనలపై టెలీఫిల్మ్‌లు తీసి ప్రజలను చైతన్యపర్చారు.. సింగరేణి బొగ్గు బావుల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లకు కట్టినట్టు నాటకాల రూపంలో ప్రదర్శించారు. నవోదయ మిత్ర కళా మండలిని స్థాపించి 154కు పైగా నాటికలను ప్రదర్శించి 1960లోనే అప్పటి గవర్నర్ భీమ్ సేన్ సబార్ చేతుల మీదుగా ఉత్తమ బహుమతి అందుకు న్నాడు. అలాగే నిర్భయ భారతం, బైరాన్‌పల్లి, సిక్త్ జర్ని, శ్రీశైలం, గల్లీ గ్యాంగ్, పది రూపాయల నోటు, పోరు తెలంగాణ సినిమాల్లో శంకర్ ప్రత్యేక పాత్రలను పోషించారు.

అప్పట్లో కోల్‌బెల్ట్ ప్రాంతంలోని యువకులు చెడు మార్గంలో ప్రయాణిస్తుండడంతో వారిలో మార్పు తీసుకు రావడానికి వారి తల్లిదండ్రులు పడుతున్న కష్టాలపై టెలిఫిల్మ్‌లు రూపొందించి వాటికి దర్శకత్వం వహించారు. ఇప్పటికీ 81సంవత్సరాల వయసులోనూ దామెర శంకర్ కోల్‌బెల్ట్‌లో పలు టెలీఫిల్మ్‌లు రూపొందిస్తూ, వివిధ కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.

యువతను చెడు మార్గంలో వెళ్లకుండా చేయడమే లక్ష్యం..: దామెర శంకర్



కోల్‌బెల్ట్ ప్రాంతంలో ఒకప్పుడు ఇక్కడ యువకులు 10 తరగతి అయిపోయిన వెంటనే ఆటో డ్రైవర్లుగా మారేవారు. కానీ ఇప్పుడు పరిస్థితు లు మారాయి. చాలా మంది సాఫ్ట్‌వేర్ ఉద్యో గులుగా మారారు. అప్పుడున్న పరిస్థితులపై అనేక టెలిఫిల్మ్‌లను తీసి యువతను సన్మార్గంలో నడిపించడమే లక్ష్యంగా చేసుకుని నాటికలు, నాటకాలు ప్రదర్శన, సమాజంలో చెడును నిర్మూలించి,మంచి మార్పు తేవడమే లక్ష్యంగా టెలిఫిల్మ్‌లను నిర్మిస్తున్నాను.

రేషన్ బియ్యం పట్టివేత

జగిత్యాలరూరల్, నవంబరు 15, (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం లోని శ్రీ ఆంజనేయ రైస్‌మిల్‌లో అక్రమంగా నిల్వ చేసిన 160 క్వింటాళ్ల నూకలు, 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని సివిల్ సప్లై అధికారులకు అప్పగించినట్లు స్పెషల్ బ్రాంచ్ ఏఎస్సై మధు తెలిపారు. రైస్‌మిల్‌లో పట్టుకున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు డీటీసీ ఎస్ వరప్ర సాద్, ఆర్ఐలు రాజేంద్రప్రసాద్ స్వాధీనం చేసుకొని సివిల్ సప్లై గోదాంకు తరలించారు. ప్రభాకర్ పై 6 ఏ కేసు నమోదు చేసినట్లు డీటీసీఎస్ వరప్రసాద్ తెలిపారు.

మంథనిలో 16 క్వింటాళ్లు..

మంథని: స్థానిక శ్రీపాద కాలనీలోని బోగె సర్వేశ్ ఇంట్లో సివిల్ సప్లై అధికారులతో కలిసి శుక్రవారం తనిఖీలు నిర్వహించగా, 16 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని 40 ప్లాస్టిక్ బ్యాగుల్లో అక్రమంగా నిల్వ ఉన్నట్లు గుర్తించామని ఎస్ఐ రమేష్ తెలిపారు. ఈ బియ్యాన్ని పీడీఎస్ బియ్యం గా అధికారులు గుర్తించారన్నారు. అక్రమ నిల్వపై సర్వేశ్‌ను ప్రశ్నించగా మంథని మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ లబ్ధిదారుల నుంచి, మంథనిలోని రేషన్ డీ లర్ గుండా ధనలక్ష్మి నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్రలో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు తెలిపారు. రేషన్ డీలర్ గుండా ధనలక్ష్మి తన షాప్ నుంచి 7 క్వింటాళ్ళ పీడీఎస్ రైస్‌ను లబ్ధిదారులకు ఇవ్వకుండా తనకు అమ్మినట్లు సర్వేష్ వెల్లడించారన్నారు. సర్వేష్, డీలర్ గుండా ధనలక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- సమగ్ర కుటుంబ సర్వేపై అపోహలు వద్దు - ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు రానీయొద్దు
- బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సిరిసిల్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 20న రాజన్న సిరిసిల్ల జిల్లాకు రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నాగుల సత్యనారాయణతో కలిసి సీఎం ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ప్రభుత్వ శాఖల అధికారులు పర్యటనను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. సీఎం రాక సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా దర్శనం ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోం దన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపర్చేందుకు దృఢసంకల్పంతో కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేపై ప్రజలు అపోహ పడవద్దని, దేశానికే దిక్సూచిగా తెలంగాణలో సర్వే నిర్వహించనున్నామని అన్నారు. ప్రజలు ఎన్యూమరేటర్లకు సహకరించి వివరాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా సర్వేపై అపోహలు అభ్యంతరాలు లేవనెత్తితే అధికారులు స్పందించి సర్వే ఆవశ్యకతపై వివరించాలన్నారు. వారి అపోహలను తొలగించాలన్నారు. సంక్షేమ పథకాల్లో కోత విధించబోమని స్పష్టం చేశారు.

● ఖాతాల్లో డబ్బులు జమఅయ్యేలా..

జిల్లాలో ధాన్యం విక్రయించేందుకు రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ధాన్యం సేకరించి త్వరగా ఆన్‌లైన్ చేసి డబ్బులు ఖాతాల్లో జమయ్యేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సన్నధాన్యం విక్రయానికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైస్‌మిల్లర్లు సహకరించకపోతే తాత్కాలిక గోదాముల్లో ధాన్యం నిల్వ చేయాలన్నారు. బ్యాంక్ గ్యారంటీ ఇచ్చి ధాన్యం దించుకోవాలని రైస్‌మిల్లర్లకు సూచించారు. వారిపై తమకు కోపం లేదని డిఫాల్ట్ రైస్‌మిల్లర్లు ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలు ఇవ్వాలని అన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరందించే పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్ కోసం భూమిని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇందిరమ్మ ఇళ్ల పథకంలో వేములవాడ నియోజకవర్గంలో మిడ్ మానేరు నిర్వాసితుల కోసం 10, 600 ఇళ్లు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సీసీ కెమెరాలను ప్రారంభించిన మంత్రి

జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 46 సీసీ కెమెరాలను శుక్రవారం కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. జిల్లాలో ప్రధాన రహదారులు బోయినపల్లి నుంచి జిలెల్ల వరకు, రుద్రంగి నుంచి వేములవాడ వరకు పైలట్ ప్రాజెక్ట్‌గా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు, త్వరలోనే ఎల్లారెడ్డిపేట నుంచి పెద్దమ్మ స్టేజీ వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, వ్యాపారస్థులు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీస్ వారితో సమానమన్నారు. జిల్లాలో నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలను పోలీస్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేశామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఎస్పీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

26న నిర్వహించే దేశ వ్యాప్త నిరసనను విజయంతం చేయాలి - ఐఎఫ్‌టీయూ జాతీయ కార్యదర్శి శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

కోరుట్ల నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని నరంద్రమోదీ అవలం బిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి ఈ నెల 26న జిల్లా కేంద్రాలలో నిర్వహిస్తున్న నిరసన ప్రదర్శనలకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్ని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయు ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సినారే కళా భవనంలో రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై ఏకగ్రీవ తీర్మానం చేసి చర్చించారు. ఈ సమావేశానికి హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ 2020 నవంబరు 26న ఢిల్లీలో మోదీ సర్కార్ ప్రవేశ పెట్టిన మూడు వ్యతిరేక చట్టాలపై ఉద్యమం ప్రారంభం అయిందన్నారు. ఈ ఉద్యమం 384 రోజులు కొన సాగిందని మోదీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన చట్టాలను వెనక్కి తీసుకునే విధంగా ఉద్యమం జరిగిందన్నారు. ఈ ఉద్యమం రైతు విజయమన్నారు. 10 సంవత్సరా లుగా మోదీ కార్మిక, రైతుంగ వ్యతిరేక విదానాలు అమలు చేస్తుందని అన్నారు. ప్రదానంగా రైతాంగం పడించిన అన్ని రకాల పంటలకు పార్లమెంట్‌లో కనీస మద్దతు ధరను చట్టబద్దం చేయాలని, దేశంలోని కీలక ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీ కరణ అపాలని , కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌న్ రద్దు చేయ్యాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా అసంఘటిత స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ. 26,000, కనీస పెన్షన్ రూ. 10,000 ప్రకటించాలని కోరుతూ ఎస్‌కేఎం టీయు సంయుక్తంగా ఈ నెల 26న నిర్వహిస్తున్న నిరసన ప్రదర్శనను కార్మికులు కార్మిక సంఘ నాయకులు పాల్గొన్ని విజయవంతం చేయ్యాలని కోరారు. సమావేశంలో మొదట అమరవీరులకు నివాళ్లు అర్పించిన నాయకులు కార్మికులు ఎదుర్కోంటున్న సమస్యలపై చేయ్యవలసిన ఉద్యమాలపై చర్చించి వాటిని ఎకగ్రీవ తీర్మాణం జరిపి చేయ్యవలసిని కార్యక్రమాల వివరాలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు రాష్ట్ర ప్రదాన కార్యదర్శి జనార్దన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు భూమేశ్వర్, దాసు, భూమన్న అరుణ, సహాయ కార్యధర్శులు దర్శులు గంట, నాగయ్య, శివాజీ, కోశాధికారి సారంగపాణి, రాష్ట్ర కమిటి సభ్యులు నరేష్, శ్రీనివాస్, బ్రహ్మానందం, లింగ్య, గౌని నాగేశ్వర రావు, శివ ఆశోక్, శంకర్, వేంకట్, తోడెటి నాగేశ్వర్ రావు, రాజేష్, హరితతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణి ప్రసవం శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి లో గురువారం అర్ధరాత్రి గర్భిణి ప్రసవించింది. శిశువు మృతి చెందడంతో వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు శుక్రవరాం ఆస్పతి ఎదుట ఆందోళన చేపట్టారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్‌కు చెందిన కళ్లెం లక్ష్మి ప్రసవం కోసం పట్టణంలోని బుడగ జంగాల కాలనీలో ఉంటున్న తన తల్లి గారింటికి వచ్చింది. పురిటి నొప్పులు రావడంతో గురువారం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. స్కానింగ్ చేయించుకొని రావాలని వైద్యులు సూచించారు. దీంతో జమ్మికుంట పట్టణంలో స్కానింగ్ చేయించుకొని ఆస్పత్రికి వచ్చారు. వైద్యులు అర్ధరాత్రి ఒంటి గంటకు ఆపరేషన్ చేశారు. పుట్టిన శిశువు పరిస్థితి విషమంగా ఉందని, కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. చికిత్స కోసం శిశువును కరీంనగర్‌కు తరలించారు. శిశువు అప్పటికే చనిపోయిందని అక్కడి వైద్యులు తెలిపారు. దీంతో శిశువు మృతికి స్థానిక వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకొని బంధువులతో మాట్లాడారు. బాధితురాలి తల్లి రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా ఈ ఘటనపై ఆస్పత్రి సూపరిం టెండెంట్ రాజేందర్‌రెడ్డి వివరణ కోరగా గర్భిణి నెలలు దాటిన తరువాత ఆస్పత్రికి వచ్చిందని చెప్పారు. ఆపరేషన్ చేసి శిశువును బయటికి తీశా మని తెలిపారు. శిశువు ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందిగా మారడంతో కరీంనగర్‌కు రిఫర్ చేశామని అన్నారు. ఆస్పత్రికి వెళ్తున్న క్రమంలో మార్గ మధ్యలో శిశువు మృతి చెందిందని తెలిపారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ప్రైవేట్ బస్సు



ప్రమాదానికి గురైన బస్సు

కరీంనగర్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా పబ్బేరు సమీపంలో ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు పొలాల్లోకి దూసుకెళ్లడంతో కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన పలువురికి గాయాలయ్యాయి. దుర్శేడ్ గ్రామం నుంచి 40 మంది, పెద్దపల్లి జిల్లా నుంచి మరో పది మంది కార్తీక మాసం సందర్భంగా ప్రైవేటు టూరిజం బస్సులో అలంపూర్‌లోని ఆలయానికి శుక్రవారం రాత్రి బయలు దేరారు. శనివారం ఉదయం వేకువజామున బస్సు బ్రేకులు ఫెయిల్ కావడంతో బస్సు ప్రమాదవశాత్తు పొలాల్లోకి దూసుకెళ్లిందని గ్రామస్థులు తెలిపారు. ఈ ప్రమాదంలో 15 మందికి గాయాలు కాగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దుర్శేడ్ గ్రామానికి చెందిన గ్రామస్థులు తమ కుటుంబసభ్యుల పరిస్థితిపై ఆరా తీయగా అందరూ క్షేమంగా ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు.

గుడి నిర్మాణంపై వివాదం

- అభ్యంతరం చెప్పిన పక్క స్థలం యజమాని- కాలనీవాసులపై పెట్రోల్ పోసిన వైనం


ఎన్టీపీసీలో రాస్తారోకో చేస్తున్న కృష్ణానగర్ వాసులు

జ్యోతినగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణానగర్‌లో గుడి నిర్మాణం వివాదానికి దారితీసింది. గుడి కట్టద్దంటూ పక్క స్థలం యజమాని, మరో వర్గం వారు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. గుడిని నిర్మిస్తున్న కాలనీవాసులపై పక్క భూమి యజమాని ఇందారం శ్రీనివాస్ పెట్రోల్ పోశాడు. దీంతో కాలనీవాసులు ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తమపై పెట్రోల్ చల్లిన శ్రీనివాస్‌పై హత్యాయత్నం కేసు పెట్టాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఇరు వర్గాలతో పోలీసులు మాట్లాడుతున్న సమయంలో కృష్ణానగర్‌కు చెందిన పలువురు వ్యక్తులు, కొన్ని సంస్థలకు చెందిన నాయకులు పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చారు. శ్రీనివాస్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేశారు. రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎన్టీపీసీ పోలీసులు రాస్తారోకో చేస్తున్న వారిని బలవంతంగా పంపించివేశారు. గుడి నిర్మిస్తున్న కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. అలాగే మరో వర్గం ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం కాలనీవాసులపై కౌంటర్ కేసు నమోదు చేశారు.

● విలువైన భూమి కావడం వల్లే..

గుడి నిర్మిస్తున్న స్థలం పక్కన ఉన్న భూమి విలువైనది కావడమే వివాదానికి కారణమని తెలుస్తున్నది. నిర్మించాలనుకుంటున్న స్థలం పక్కనే ఇందారం శ్రీనివాస్‌కు చెందిన నాలుగు గుంటల స్థలం ఉంది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం కోటి రూపాయలకు పైగా ధర పలుకుతుందని తెలుస్తున్నది. గుడి నిర్మిస్తే తన స్థలం రేటు పడిపోతుందనే అనుమానంతో సదరు భూయజమాని అభ్యంతరం చెబుతున్నట్లు తెలుస్తోంది.

సమగ్ర కుటుంబ సర్వేకు సిబ్బంది కొరత

- బొమ్మకల్‌లో ఆలస్యంగా ప్రారంభమైన సర్వే
- గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో షురూ


బొమ్మకల్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే సిబ్బంది కొరతతో కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో ఇంకా కుటుంబాల నిర్ధారణ సర్వే కూడా పూర్తి కాలేదు. కరీంనగర్ మండలంలో మొత్తం 17 గ్రామపంచాయతీలు ఉండగా ఈనెల 8వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో స్టిక్కర్‌లు వేసి సర్వేను ప్రారంభించగా బొమ్మకల్ గ్రామంలో ఆలస్యమైంది. శుక్రవారం నుంచి గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో సర్వే ప్రక్రియ కొన సాగుతోంది. మొత్తం 35 మంది ఎన్యూమరేటర్లు అవసరం కాగా పూర్తి స్థాయిలో సిబ్బంది లేకపోవడంతో ఉన్న వారిపై అదనపుభారం పడు తోంది. బొమ్మకల్ గ్రామంలో 4,900 కుటుంబాలు ఉన్నట్లు తాజాగా అధికారులు తెలిపారు. అయితే సర్వేలో భాగంగా ఇంటింటికి స్టిక్కర్లు అంటించిన తరువాత కుటుంబాలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. కరీంనగర్ మండలంలో 16 గ్రామాల్లో మొత్తం 10,400 కుటంబాలు ఉండగా సర్వే చేపట్టిన ఎన్యూ మరేటర్లు శుక్రవారం నాటికి 5300 కుటుంబాల్లో సర్వే పూర్తి చేసినట్లు ఎంపీడీవో సంజీవరావు తెలిపారు. బొమ్మకల్ గ్రామంలో మాత్రం ఇంకా సర్వే పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. శుక్రవారం మండల పంచాయతీ అధికారి జగదీశ్వర్ గ్రామంలో పర్యటించి సర్వే అంతరాయానికి గల కారణాలను సిబ్బందిని అడిగి తెలుసు కున్నారు. మున్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టడంతోనే అవగాహన లేక ఇన్నాళ్లు ఇబ్బందులు ఏర్పడగా గ్రామపంచాయతీ సిబ్బందిని సర్వేలో భాగస్వాములను చేయడంతో ఎట్టకేలకు ప్రారంభమైంది.

చొప్పదండిలో వస్త్ర దుకాణం దగ్ధం

చొప్పదండి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) చొప్పదండి పట్టణంలోని గాలిపెల్లి కనుకయ్య వస్త్ర దుకాణం కాలిపోయింది. కనుకయ్య శుక్రవారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. అనంతరం గుర్తు తెలియని వ్యక్తి షట్టర్ ముందు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. మంటలు దుకాణంలోకి వ్యాపించాయి. గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేశారు. అప్పటికే దుకాణంలోని సామగ్రి కొంత మేర కాలిపోయింది. సుమారు 60 వేల రూపాయల నష్టం జరిగినట్లు కనుకయ్య తెలిపాడు. కాగా వస్త్ర దుకాణానికి వ్యక్తి నిప్పు అంటించిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయిన వీడియో స్థానికంగా సమాచార మాధ్యమాల్లో వైరలుగా మారింది.

గడ్డివాము దగ్ధం : రూ.80 వేల ఆస్తి నష్టం

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 15: హుజూరాబాద్ మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలో వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం గడ్డి వాము దగ్ధమైంది. గ్రామంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో వరి కొయ్యకాళ్లను కాల్చేందుకు నిప్పు పెట్టగా, ప్రమాదవశాత్తు నిప్పు రవ్వలు వ్యవసాయ క్షేత్రానికి పక్కనే నిల్వ ఉన్న గడ్డివాములపై పడటంతో అవి దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో రూ.80 వేల ఆస్తి నష్టం జరిగింది. ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు.



సదిశ వలంటీర్లు

సమాజ సేవలో సదిశ

- పేద విద్యార్థులకు ఉచితంగా ఇంటర్ విద్య
- యువ ఇంజనీర్ ఆదర్శం
- గూగుల్ సంస్థ ఉద్యోగుల సహాయం
- మూడు రాష్ట్రాలకు విస్తరణ

పేద విద్యార్థులు ఇంటర్ విద్యకు దూరం కాకూడదని ఓ యువ ఇంజనీర్ సంకల్పించాడు. సదిశ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ప్రతిభ గల విద్యార్థులకు ఉచితంగా ఇంటర్ విద్యను అందిస్తూ అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపుతున్నాడు గోవర్దన్‌రెడ్డి. గూగుల్ సంస్థలో పనిచేస్తూ ఉద్యోగుల సహకారంతో మన రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రకు కూడా తన సేవలను విస్తరించాడు. ఇప్పటి వరకు 232 మంది విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించాడు. సంస్థలో 289 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా పని చేస్తున్నారు.

చొప్పదండి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలం రెవెల్లి గ్రామానికి చెందిన ముచర్ల గోవర్దన్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. తాను చిన్నప్పుడు చదివిన ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులు ఫీజు చెల్లించే స్తోమత లేక ఇంటర్ విద్యకు దూరం అయ్యే పరిస్థితులను చూసి చలించి పోయాడు. 2013లో తాను చదువుకున్న పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశాడు. 2016లో సదిశ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నాడు. పలువురు యువకుల సహకారంతో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇంటర్ విద్యను, హాస్టల్ వసతిని కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు గోవర్దన్‌రెడ్డి. సదిశ వేదికగా అనేక మంది యువత సమాజ సేవకు పాటు పడుతున్న సందర్భంగా ప్రత్యేక కథనం...

ఇద్దరితో మొదలైన ప్రస్థానం

గోవర్దన్‌రెడ్డి ఇద్దరు వలంటీర్లతో సేవలను ప్రారంభించారు. 2016లో సదిశను స్థాపించిన తరువాత అనేక మంది యువత ఆయనతో చేతులు కలిపారు. సదిశ సంస్థ ప్రతి సంవత్సరం ఆరు కేంద్రాల్లో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తుంది. రాష్ట్రంలోని కరీంనగర్, వరంగల్, సూర్యాపేట, ఖమ్మంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, మహారాష్ట్రలోని నాందేడ్ కేంద్రంగా పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు ఉచిత విద్య ను అందజేస్తుంది. ప్రస్తుతం 289 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా పని చేస్తున్నారు. పరీక్ష నిర్వహణతో పాటు విద్యార్థుల ఎంపిక బాధ్యతను వలంటీర్లు చూసుకుంటారు. కరీంనగర్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలకు లక్షలాది రూపాయలను చెల్లించి ప్రతి ఏటా విద్యార్థులను చేర్పిస్తున్నారు. ఈనెల 10న మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌ను సదిశ నిర్వహించగా మొత్తం 4,169 మంది విద్యార్థులు హాజరయ్యారు. 67మంది విద్యార్థులకు ఉచితంగా ఇంటర్ విద్యను హాస్టల్ వసతిని కల్పించాలని సంస్థ నిర్ణయించింది.

ప్రతి ఏటా లక్షల రూపాయల ఆర్థిక సహాయం

టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బడ్జెట్‌కు అనుగుణంగా ఎంపిక చేసి కార్పొరేట్ కళాశాలల్లో రెండేళ్ల పాటు ఉచితంగా హాస్టల్ వసతితో ఇంటర్ విద్యను అందిస్తారు. ఒక్కో విద్యార్థిపై లక్షకు పైగా ఖర్చు పెడుతుండగా ఆర్థిక వ్యవహారాలన్నీ గోవర్దన్‌రెడ్డి చూసుకుంటారు. ప్రస్తుతం గూగుల్ సంస్థలో ఉద్యోగం చేస్తున్న గోవర్దన్ రెడ్డి తాను సంపాదించిన వేతనంలో ఇరవై శాతం డబ్బులు విద్యార్థుల కోసం ఖర్చు చేస్తున్నారు. తన తోటి ఉద్యోగులు కూడా సహాయం చేస్తుండగా ప్రతి ఏటా లక్షలాది రూపాయలను సేకరించి గోవర్దన్ విద్యార్థులకు వెచ్చిస్తున్నా రు. ఇద్దరితో మొదలైన విద్యార్థుల సంఖ్య గత ఏడాది 57 మందిని కళాశాలలో చేర్పించారు. గూగుల్ ఉద్యోగులు గత ఏడాది 35 వేల డాలర్ల సహాయాన్ని అందించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి
ముచర్ల గోవర్దన్‌రెడ్డి, సదిశ సంస్థ వ్యవస్థాపకుడు



ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సంస్థ ద్వారా సహాయం చేస్తున్నాం. అనేక ఇబ్బందులు ఎదురవుతున్నా ముందుకు సాగుతున్నాం. వలంటీర్లు స్వచ్ఛంద సేవ చేస్తుండగా సహోద్యోగులు విద్యార్థుల చదువు కోసం సహాయం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెంచుతున్నాం.





విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తున్న వలంటీర్లు, సదిశ విద్యార్థులు

వాలీబాల్‌లో ఎలగందల్ విద్యార్థిని ప్రతిభ


నక్షత్రను అభినందిస్తున్న హెచ్‌ఎం ఆనందం

భగత్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కొత్తపల్లి మండలం ఎలగందల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని డి.నక్షత్ర ఎంపికయ్యారు. ఈనెల 16 నుంచి 18 వరకు మెదక్ జిల్లా చేగుంటలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో 14 సంవత్సరాల విభాగంలో ఆమె పాల్గొంటుంది. ఈనెల 6న జగిత్యాల జిల్లా కొడిమ్యాలలో జరిగిన ఉమ్మడి జిల్లా పోటీల్లో పోటీల్లో అత్యంత ప్రతిభ చాటి జిల్లా జట్టుకు ఎంపికైంది. ఈ సందర్భంగా నక్షత్రను ప్రధానోపాధ్యాయుడు తుమ్మ ఆనందం, వ్యాయామ ఉపాధ్యాయుడు గిన్నె లక్ష్మణ్, ప్రజా ప్రతినిధులు ఎల్లండి ప్రకాశ్, నిమ్మల అంజయ్య, వంశీ అభినందించారు.

తెలంగాణ పవర్ ఇంజనీర్స్ కార్యవర్గం


అంజయ్య


రఘు


రాజు

గణేశ్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ శాఖలో శుక్రవారం నిర్వహించిన పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్రాంచ్ సెక్రెటరీగా నాయిని అంజ య్య, ట్రెజరర్‌గా జి.రఘు, రాష్ట్ర ట్రాన్స్‌కో వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.రమేష్, కంపెనీ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా కె.రాజు ఎన్నికయ్యారు. కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా స్వామి, పెద్దపల్లి జిల్లా కార్యదర్శిగా ప్రభాకర్, జగిత్యాల జిల్లా కార్యదర్శిగా ప్రసాద్, జాయింట్ సెక్రెటరీగా శశికాంత్, ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీగా షరీఫ్, ప్రదీప్, అనిల్,ఆడిట్ కమిటీ మెంబర్గా గట్టయ్య, అదనపు కార్యదర్శిగా సంతోష్, రమాకాంత్, పూర్ణచందర్లు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో ఐదు వేల మంది ఇంజనీర్లు పాల్గొన్నారు.

డయల్ యువర్ ఆర్‌ఎంకు స్పందన

భగత్‌నగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎస్ సుచరిత డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రామనికి వచ్చిన కాల్స్‌కు సమాధానాలు ఇచ్చారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని 34 మంది ప్రయాణికులు ఫోన్లు చేయగా వారి అర్జీలను పరిశీలించి సంబంధిత డిపో మేనేజర్లకు ఆదేశాలు జారీ చేస్తామని ఆర్‌ఎం తెలిపారు.

గంజాయి రవాణా, అమ్మకాలపై పోలీసుల దృష్టి

గోదావరిఖనిలో తనిఖీలు

కోల్‌సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో గంజాయి రవాణా, అమ్మకాలపై వన్‌టౌన్ పోలీసులు దృష్టి పెట్టారు. శుక్రవారం రాత్రి సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో ఆకస్మిక తనిఖీలు జరిపారు. శివారు కాలనీల్లోని కిరాణాషాపులు, పాన్‌షాపులు, అనుమానం ఉన్న వ్యక్తుల ఇళ్లలో తనిఖీలు జరిపారు. నిర్మానుశ్య ప్రాంతాల్లో గంజాయి సేవిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారనే సమాచారంతో ఖాళీ ప్లాట్లు, చెట్లు ఉన్న ప్రాంతాల్లో సైతం తనిఖీలు జరిపారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐలు రమేష్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

- ధర్మారం, (ఆంధ్రజ్యోతి): కిరాణా దుకాణాల్లో గంజాయి చాక్లెట్స్ విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ శీలం లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు.
- జూలపల్లి, (ఆంధజ్యోతి) మండల కేంద్రంలోని పలు పాన్‌షాపుల్లో శుక్రవారం జూలపల్లి ఇన్‌చార్జి ఎస్సై నరేష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గంజాయి, మాదక ద్రవ్యాల నిల్వలపై విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసులు పాల్గొన్నారు.

మైనర్లకు మద్యం అమ్మిన వైన్‌షాప్ పై ఫిర్యాదు

మంథని, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌ఆర్ వైన్సు షాపులో నిబంధనలకు విరుద్ధంగా మైనర్ల మద్యం అమ్మినందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎక్సైజ్ సీఐకి ఫిర్యాదు చేసినట్లు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పోతరవేన క్రాంతికుమార్ శుక్రవారం తెలిపారు. మైనర్లకు మద్యం అమ్మిన, వారు సిట్టింగ్ రూంలో మద్యం సేవించిన ఫోటోలు, వీడియోలను అందజేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘించి మైనర్లకు మద్యం అమ్మిన షాపు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఆలయాల్లో కార్తీక శోభ


గోదావరి హారతిలో పాల్గొన్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


వేములవాడలో ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ

ధర్మపురిలో కార్తీక పౌర్ణమి ఉత్సవాలు

ధర్మపురి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో కార్తీక పౌర్ణమి ఉత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పంచ పర్వదినాల్లో ఆఖరి రోజున పౌర్ణమి పురస్కరించుకుని సూర్యోదయం ముందు నుంచే క్షేత్ర నలు మూలల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. గోదావరిలో స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించారు. స్వామి వారలను దర్శించుకున్నారు. సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగుసేవలు అందించారు. కార్తీక మాసం పురస్కరించుకుని దేవాలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు మహిళలు వత్తులు, కార్తీక దీపాలు వెలిగించారు. యాత్రికుల సౌకర్యార్థం ఆర్టీసీ కరీంనగర్, జగిత్యాల, మంచిర్యాల, కోరుట్ల డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ రాంనర్సింహారెడ్డి నేతృత్వంలో ఎస్‌ఐలు గంగుల మహేష్, శ్రీధర్‌రెడ్డి, సతీష్, కుమారస్వామి, సిబ్బంది బందోబస్తు చర్యలు చేపట్టారు.

వైభవంగా పంచ సహస్ర దీపాలంకరణ

ధర్మపురి బ్రహ్మపుష్కరిణి (కోనేరు)లో పంచ సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. బ్రహ్మపుష్కరిణి మధ్య గల భోగ మండపంలో గల ప్రత్యేక వేదిక పైన నరసింహస్వామి, లక్ష్మీదేవి చిత్ర పటాలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి దీపాలంకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోనేరులోని ఉత్తర ద్వారం నుంచి వేదిక వరకు, నలుమూలాల మెట్ల పైన ఐదు వేల దీపాలను భక్తులు వెలిగించి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి పత్యమ్మ, డీసీఎం ఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, జగిత్యాల అడిషనల్ ఎస్పీ భీంరావు, డీఎస్పీ రఘుచందర్, ఏఎంసీ చైర్‌పర్సన్ లావణ్య పాల్గొన్నారు.

వేములవాడ రాజన్న ఆలయంలో

వేములవాడ కల్చరల్,(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వరస్వామి ఆలయం కార్తీక శోభ సంతరించుకుంది. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. ఆలయ అధికారులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజన్న ఆలయ ముందు భాగంలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి ప్రదోషకాల పూజ అనంతరం రాత్రి 7.30 గంటలకు జ్వాల తోరణం చేపట్టారు. రాత్రి నిశిపూజ, అనంతరం రాజరాజేశ్వర స్వామికి మహాపూజ జరిపించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

వైభవంగా సామూహిక కార్తీక దీపోత్సవం

వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో సామూహిక కార్తీక దీపోత్సవం సందర్భంగా శుక్రవారం భక్తులు కార్తీ దీపాలను వెలిగించారు. రాజన్న ఆలయంలోని కళాభవన్‌లో ఏర్పాటు చేసిన సామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ ప్రారంభించారు.

దుబ్బరాజన్న శైవ క్షేత్రానికి కార్తీక శోభ

సారంగాపూర్,(ఆంధ్రజ్యోతి):మండలంలోని దుబ్బ రాజన్న ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, కార్తీక దీపాలు వెలిగించారు.

కోటిలింగాలకు పోటెత్తిన భక్తులు

వెల్గటూర్, (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం కోటిలింగాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు కార్తీక దీపాలు వెలిగించి గోదావరిలో వదిలారు. అనంతరం శ్రీ పార్వతీ కోటేశ్వర స్వా మిని దర్శించుకున్నారు. అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ పూజలు జరిపించారు. ఆలయ ఈవో కాంతారెడ్డి భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశారు. రద్దీకి తగినట్లు ఏర్పాట్లు చేయ లేదని, మహిళలు బట్టలు మార్చుకోవడానికి ఇబ్బంది పడ్డార ని కొందరు భక్తులు వాపోయారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామికి డోలోత్సవం

కోరుట్ల రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంకటేశ్వర స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని దేవాలయంలో స్వామి వారి డోలోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో పురోహితులు ప్రత్యేక పూజలను జరిపారు. ప్రత్యేక వేదికపై సా మూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించగా అధిక సంఖ్యలో దంపతులు వ్రతాల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ప్రత్యేక పూజలో పాల్గొన్నాడు. ఈ కార్యక్రమంలో యజ్ఞకులు చక్రపాణి మాధవాచార్యులు, అలయ అర్చకులు వెంకట రమణ, మార్కెట్ కమిటీ చైర్మెన్ పన్నాల అంజిరెడ్డి, ఈ వో విక్రం ఆలయ చైర్మన్ కట్కం రాజేష్, గ్రామస్థులు బర్కం గంగాలక్ష్మి - నర్సయ్య, గంద్ర గోపాల్‌రావు, ద్యాగ రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, పోతుగంటి రాజేశం గౌడ్, పిట్టల రమేష్, నూతుపల్లి మధు పాల్గొన్నారు.


కోటిలింగాలలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


కోరుట్లలో సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్న దంపతులు




ధర్మపురిలో భక్తుల పుణ్యస్నానాలు, వేములవాడలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు




దుబ్బ రాజన్న ఆలయంలో భక్తుల పూజలు

సరస్వతీ శిశుమందిర్‌లో కార్తీక పౌర్ణమి హవనం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా నగరంలోని సరస్వతీ శిశుమందిర్‌లో శంకర్ ఆర్యాస్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి హవనం నిర్వహించారు. పాఠశాల అభివృద్ధి, లోక కల్యాణం కోసం ఈ హవనం జరిపామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సముద్రాల రాజగోపాల్‌-ప్రణీతారాణి, కర్నాటి శివశంకర్‌-సారిక దంపతులు, పాఠశాల అధ్యక్ష కార్యదర్శులు బల్మూరి కరుణాకర్‌రావు, కోల అన్నారెడ్డి, సమితి అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ చక్రవర్తుల రమణాచార్యులు, ఎలగందుల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలను పరామర్శించిన 'వెలిచాల'

కరీంనగర్ అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావును కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తల్లి నర్సమ్మ మృతి చెందగా ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి రాజేందర్‌రావు పరామర్శించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు మామ మాధవరావు మృతి చెందగా ఎలిగేడ్ మండలం శివపల్లిలో పరామర్శించారు.

అల్ఫోర్స్‌లో 'కార్తీక మాసోత్సవ్'

కరీంనగర్ కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వావిలాలపల్లి అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్ట్స్‌లో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా 'కార్తీక మాసోత్సవ్' పేరుతో వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి జ్యోతి ప్రకాశనం, పూజలతో వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికలు, వేషధారణలు అలరించాయి.

ఎన్నీల ముచ్చట్లు ఓ సాహితీ యాత్ర

కరీంనగర్ కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నీల ముచ్చట్లు దశాబ్ద కాలంగా అద్భుత సాహితీ యాత్రగా నిరంతరం కొనసాగుతోందని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు సీవీ కుమార్ అన్నారు. దీపాల అర్ధరాత్రి శుక్రవారం ఎన్నీల ముచ్చట్లును కిసాన్‌నగర్‌లోని బహుజన కవి, గాయకుడు మాను పాటి రాజయ్య నివాసంలో నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి దామరకుంట శంకరయ్య, సీనియర్ రచయితలు పీఎస్ రవీంద్ర, అంజయ్య, రామయ్య, రవీందర్ పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

కరీంనగర్ కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ సూచనల మేరకు రెండో రోజు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను డీఈవో పీఎం నాగరాజు శుక్రవారం ప్రారంభించారు. విద్యార్థులు, పాఠకులు, పోటీపరీక్షల అభ్యర్థులు పుస్తకాలను తిలకించారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ ఒకప్పుడు జ్ఞానం కోసం పుస్తకాలు చదివేవారని ప్రస్తుతం ఉద్యోగాల కోసం పుస్తకాలు చదువుతున్నారన్నారు. ఉద్యోగాలు సాధించిన అనంతరం కూడా పుస్తకాలు, పత్రికలు ఉపయోగపడుతున్నాయని స్పష్టం చేశారు. గ్రంథాలయాలు పేద విద్యార్థుల కోసం ఎంతగానో ఉపకరిస్తున్నాయని, వాటిని ఎంతగా వాడుకుంటే అంతగా ఉన్నత


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో నాగరాజు

స్థానాలకు ఎదగవచ్చని తెలిపారు. అనంతరం ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు 'భారతదేశ పుణ్య క్షేత్రాలు' అంశంపై, కళాశాల విద్యార్థులకు 'నూతన విద్యా విధానం' అంశం పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎ సరి త, సిబ్బంది పాల్గొన్నారు.

● **అల్ఫోర్స్ విద్యార్థుల సందర్శన..**

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని వావిలాలపల్లికి చెందిన అల్ఫోర్స్ ఈ టెక్నో గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులు సందర్శించి పుస్తకాలను తిలకించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌ఓ యు నాగరాజు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఆలోచనలు, ఏకాగ్రత, చదువుపై దృష్టి, పఠనాశక్తికి గ్రంథాలయాలు తోడ్పడతాయని వివరించారు.

అంధుల ఆశ్రమ పాఠశాలలో రేకుల షెడ్డు ఏర్పాటు

భగత్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 18వ డివిజన్లోని రేకుర్తిలో గల అంధుల ఆశ్రమ పాఠశాలలో రేకుల షెడ్డును ఉమ్మడి జిల్లా 1995 బ్యాచ్ ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు బట్టలు ఆరేసుకునేందుకు షెడ్డు లేదని తెలుసుకొని సుమారు 50 వేల రూపాయలతో రేకుల షెడ్డును నిర్మించి, శుక్రవారం వాడుకలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహ, అధ్యాపకుల బృందం పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఏఆర్ 1995 బ్యాచ్‌కి చెందిన పోలీసులు పాల్గొన్నారు.

గిరిజన రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

భగత్‌నగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): లగచర్లలో గిరిజన రైతులపై పెట్టిన అక్రమకేసులు ఎత్తివేయాలని లంబాడ జేఏసీ చైర్మన్, కొత్తపల్లి మాజీ వైస్ఎంపీపీ భూక్య తిరుపతినాయక్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వమని శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తే ప్రభుత్వం అక్రమ కేసులుపెట్టి వేధిస్తున్నదన్నారు. కేసులు వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

మైనార్టీ సెల్ కార్యదర్శిగా గౌసెపాషా

కరీంనగర్ క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శిగా కరీంనగర్‌లోని కిసాన్‌గుట్టపల్లికి చెందిన మహ్మద్ గౌసెపాషాను నియమకం చేశామని మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ తాజొద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో కార్తీక పౌర్ణమి పూజలు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం భగత్‌నగర్ జడ్పీ క్వార్టర్ల ఆవరణలోని అయ్యప్ప ఆలయంలో కార్తీక పౌర్ణమి పూజలు వైభవంగా జరిగాయి. శనివారం నుంచి జనవరి 15వ తేదీ వరకు అభిషేక, హోమాలు, పడిపూజలు నిర్వహిస్తామని ఆలయ ఈవో కొన్న కాంతారెడ్డి తెలిపారు. నవంబరు 25 నుంచి జనవరి 8 వరకు అన్న ప్రసాద వితరణ, డిసెంబరు1 నుంచి జనవరి1 వరకు అల్పాహార వితరణ ఉంటుందని తెలిపారు.

డీసీసీ మాజీ అధ్యక్షుడు కె హన్మంతరావు మృతి

కరీంనగర్ అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ కటుకంట్ల హన్మంతరావు(78) అనారోగ్యంతో చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని ఒక ఆసుపత్రిలో శుక్రవారం ఉదయం మరణించారు. కరీంనగర్‌లోని ముకరంపురలో నివాసం ఉంటున్న హన్మంతరావుది శంకరపట్నం మండలం ఎరడపల్లి స్వగ్రామం. ఆయన 1991 నుంచి 1996 వరకు కరీంనగర్ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా, శంకరపట్నం మండలం తాడికల్ సహకార సంఘం అధ్యక్షుడిగా, డీసీఎంఎస్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. రాజకీయాలకు అతీతంగా అందరూ హన్మంతరావును బాయ్‌సాబ్‌గా పిలుచుకునేవారు. హన్మంతరావు అంత్యక్రియలు ఇరుకుల్లలోని వర్ధమాయక శ్మశానవాటికలో పూర్తిచేశారు.



అంత్యక్రియల్లో ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ టి సంతోష్ కుమార్, మాజీ మేయర్ డి శంకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెపల్లి మోహన్, వాల రమణరావు, వహాబ్‌రెడ్డి, రాజకీండ తిరుపతిగౌడ్, రంజిత్‌రావు, రైతు ప్రజాసంఘాల జాతీయ నాయకుడు పోలాడి రామారావు, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

● డీసీసీ మాజీ అధ్యక్షుడు కె హన్మంతరావు మృతిపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

అడవి బిడ్డల ఆరాధ్య దైవం బిర్సా ముండా

గణేశ్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సాహసానికి ప్రతీక, అడవి బిడ్డలకు ఆరాధ్య దైవం బిర్సా ముండా అని ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ నాగార్జున అన్నారు. మై భారత్ కరీంనగర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన బిర్సా ముండా జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం భగవాన్ బిర్సా ముండా జయంతిని గిరిజన స్వాభిమాన దివస్‌గా ఘనంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. అనంతరం వ్యాసరచన పోటీ, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. జిల్లా యువజన అధికారి ఎం


సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జున

వెంకట రాంబాబు, డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జనపట్ల రమేందర్, నెహ్రూ యువ కేంద్ర ప్రోగ్రాం అధికారి, తొట్ల శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉదయం బడి.. మధ్యాహ్నం సర్వే

(5వ పేజీ తరువాయి)

పూర్తిచేసి జాతీయ రహదారుల ఆథారిటీకి అప్పగించాలన్నారు. జిల్లాలో చేపట్టే రోడ్డు ఉద్యోగులు, అధికారులు అందుబాటులో ఉండటం లేదని, దీనితో సేవలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ప్రజలు వాపోతున్నారు. 2014లో అనాటి ప్రభుత్వం నిర్వహించినట్లు ఒకే రోజు సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తే బాగుండేదని, 25 రోజుల పాటు సర్వే నిర్వహించడంతో సర్వే వల్ల ప్రజలు కూడా ఆసక్తి చూపడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పాఠశాలల్లో చదివే తమ పిల్లల చదువుపై సర్వే ప్రభావం పడకుండా చూడాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ మరమ్మతులలో భాగంగా శనివారం ఉదయం 9:30 నుండి 11:30 వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్, టు, ఏడీఈలు పంజాల శ్రీనివాస్‌గౌడ్, ఎం లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ వర్క్ షాప్ ప్రాంతం, బ్యాంక్ కాలనీ, వావిలాలపల్లి, తేజ స్కూల్, రెడ్డి ఫంక్షన్ హాల్, మెహర్‌నగర్, డీమార్ట్ ఏరియా, ఇందిరానగర్, రామాలయం, ఎస్ఆర్ఆర్ కళాశాల ఏరియా, నవరన్ వీధి, టీఎజీ భవనం, కోర్టు వెనుక వైపు, జ్యోతినగర్, పద్మనగర్, రాంనగర్, మంకమ్మతోట, సంతోష్‌నగర్, విద్యానగర్, కూర్మవాడ, శ్రీపురంకాలనీ, సీపీసీ ప్రాంతం, మార్కండేయనగర్, ప్రగతినగర్, రాజీవ్‌పార్క్, పాత లేబర్ అడ్డా ప్రాంతం, సిద్ధార్థ పాఠశాల, వాసర ఆసుపత్రి, పారమిత పాఠశాల ప్రాంతం, సాయిబాబా దేవాలయం, లాలెల్ పాఠశాల, చింతకుంట ప్రాంతం, వద్దనగర్ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

శంకరపట్నం (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని మొలంగూర్, కాచాపూర్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు విద్యుత్ సరఫరా రాదు అంతరాయం కలుగుతుందని ఆముదాలపల్లి ఏఈ శ్రీరామోజు రాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొలంగూర్, మొలంగూర్ ఇండస్ట్రియల్ ఏరియా, చింతలపల్లి, నల్లవెంకయ్యపల్లి, గుడాటిపల్లి, కాచాపూర్, రాజాపూర్, గద్దపాక, కల్వల గ్రామాల పరిధిలో సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

మౌంట్ పటల్స్ శిఖరాన్ని అధిరోహించిన 'సాన్వి' విద్యార్థి


అభినందిస్తున్న కళాశాల చైర్మన్ మునీందర్

భగత్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'మాదక ద్రవ్యాలు మా నండి' క్యాంపెయిన్‌లో భాగంగా హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలీ సమీపంలో మౌంట్ పటల్స్ శిఖరాన్ని సాన్వి కళాశాల విద్యార్థి లక్ష్మణ మణిరాజ్ అధిరోహించారు. 4200 మీటర్ల ఎత్తు గల శిఖరాన్ని వీరి బృందం కేవలం 10 గంటల్లో అధిరోహించి కిందకు దిగారు. మణిరాజ్‌ను టీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తానిపర్తి తిరుపతిరావు, కళాశాల చైర్మన్ ఎర్రం శెట్టి మునీందర్ సన్మానించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మోహన్, అఖిల్, అజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రూప్4 ఉద్యోగాలకు ఎస్సీ స్టడీ సర్కిల్ విద్యార్థులు ఎంపిక

గణేశ్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా కోచింగ్ తీసుకున్న ఏడుగురు అభ్యర్థులు టీజీపీఎస్సీ గ్రూప్-4 ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరు వివిధ ప్రభుత్వశాఖల్లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికయ్యారు. అభ్యర్థులను ఎస్సీ అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగలేశ్వర్, స్టడీసర్కిల్ డైరెక్టర్ బంధ శ్రీనివాస్, ఫ్యాకల్టీ అభినందించారు.

● **గన్నేరువరం:** ఇటీవల విడుదలైన గ్రూప్-4 ఫలితాలలో మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించడంతో శుక్రవారం వారిని సన్మానించారు. కొట్టె సాయికృష్ణ జువెనైల్ సూపరిటెండెంట్‌గా, గర్శకుర్తి నవీన్‌కుమార్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా, గర్శకుర్తి అరుణ్‌సాయి వార్డు ఆఫీసర్ ఉద్యోగాలను సాధించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, బీజేపీ నాయకుడు పల్లెం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణానికి చెందిన బొడిగె వెంకటేశ్ గ్రూప్-4 జాబ్‌కు ఎంపికయ్యారు. గురువారం ప్రకటించిన గ్రూప్-4 ఫలితాల్లో వెంకటేశ్ సిద్దిపేట రెసిడెన్షియల్ స్కూల్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. వెంకటేశ్ గ్రూప్-1 ప్రిలిమ్స్ క్వాలిఫై అయ్యి మెయిన్స్‌కి ఎంపికయ్యాడు.

ఆర్చరీ జాతీయ పోటీలకు పారమిత విద్యార్థి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడామహాశ్య అలుగుర్తుగా ఈ నెల 15, 16 తేదీల్లో గుజరాత్ రాష్ట్రంలో జరుగనున్న ఎస్‌జీఎఫ్ 68వ జాతీయస్థాయి అండర్-19 బాలుర ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలకు మంకమ్మతోట పారమిత ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి దాసరి ప్రణవ్‌తేజ ఎంపికయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డు బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల చైర్మన్ డాక్టర్ ఇ ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, వియుఎం ప్రసాద్, టీఎస్‌వి రమణ, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, కవిత, ప్రసాద్, సమన్వయకర్తలు, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.


ప్రణవ్‌తేజను అభినందిస్తున్న హెచ్ఎం బాలాజీ

జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో సత్తాచాటాలి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లో జరుగనున్న జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో సత్తాచాటి బంగారు పతకం తీసుకురావాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ పట్టణానికి చెందిన కంకణాల శ్రీవార్ 68వ జాతీయస్థాయి కళాశాలల అండర్-19 స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక కాగా శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో శ్రీవార్‌ను నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈ నెల 23 నుంచి 28 వరకు గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో శ్రీవార్ పాల్గొననున్నాడు. శ్రీవార్‌ను కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అభినందించారు.


శ్రీవార్‌ను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం


హుజూరాబాద్‌లో టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయిత హరీష్ మాట్లాడుతూ సభ్యత్వ నమోదుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం టీఎన్ ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పర్లపల్లి రవీందర్ మాట్లాడుతూ కార్యకర్తలు వంద రూపాయలతో సభ్యత్వం తీసుకుంటే ఐదు లక్షల బీమా సౌకర్యం పార్టీ కల్పిస్తున్నదన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఎన్నేల వయాస్, నాయకులు ఇల్లందుల రమేష్, లింగారావు, శివ, బత్తిని సంపత్, ఆడెపు రవీందర్, రమేష్, గంగస్వామి, ఎండి అఫ్రిద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

సైదాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని రాయికల్ తండా గ్రామంలో శుక్రవారం కరీంనగర్ మెడికల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 100మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

గడ్డి కట్టలు చుట్టే యంత్రంలో పడి తెగిన చెయ్యి

రామడుగు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండి గ్రామానికి చెందిన దేగ మల్లేశం అనే వ్యక్తి ప్రమాదవశాత్తు యంత్రంలో పడి చెయ్యి తెగిపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేశం తన గడ్డి కట్టలు చుట్టే యంత్రంతో వెలుపాటి గ్రామంలో ఓ రైతు పొలంలో పనిచేస్తున్నాడు. గడ్డి కట్టలు చుట్టే సమయంలో ప్రమాదవశాత్తు చెయ్యి యంత్రంలోకి వెళ్లి తెగిపోయింది. వెంటనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

దివ్యాంగులకు స్వయం ఉపాధి శిక్షణ

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యానగర్‌లోని యూ త్ ఫోర్ జాబ్స్ స్వచ్ఛంద సంస్థకు చెందిన గ్రాస్ రూట్ అకాడమీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు స్వయం ఉపాధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కో ఆర్డినేటర్ ఆర్ తిరుపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం ఉపాధి కల్పించే వివిధ విభాగాలకు శిక్షణ ఉంటుందని తెలిపారు. వివరాలకు 6301492276 నంబరులో సంప్రదించాలని సూచించారు.

గురుకులాలకు పాత బియ్యం సరఫరా చేయాలి

సుభాష్‌నగర్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలకు పాత బియ్యం సరఫరా చేయాలని బహుజన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేనారాష్ట్ర అధ్యక్షుడు గ్రహిత మొగురం రమేశ్ ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రప్రభుత్వం గురుకుల పాఠశాలలకు 40శాతం మెనూ చార్జీలు పెంచడం హర్షణీయమన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాలు, మైనార్టీ గురుకులాలు, జ్యోతిరావు పూలే గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు సివిల్ సప్లై అధికారులు కొత్త బియ్యం సరఫరా చేస్తున్నారని తెలిపారు. కొత్త బియ్యం వల్ల అన్నం మెత్తగా, ముద్దలుగా అవుతుందని, దీంతో పిల్లలు తినలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి పాత బియ్యం సరఫరా చేయాలని కోరారు.

కార్తీక సందడి

- సామూహిక సత్యనారాయణ వ్రతాలు .. దీపారాధనలు



మానసాదేవి ఆలయం వద్ద కోనేరులో జలాభిషేకం చేస్తున్న భక్తులు


హుజూరాబాద్‌రూరల్/జమ్మికుంట/ఇల్లందకుంట/వీణవంక/తిమ్మాపూర్/గన్నేరువరం/చిగురుమామిడి/రామడుగు/సైదాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమి సందర్భంగా ఆయా మండలాల్లోని గ్రామాల్లో ప్రజలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. హుజూరాబాద్ పట్టణంలోని పాటిబీడ ఆంజనేయస్వామి, శివాలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గందె రాధికశ్రీనివాస్ దంపతులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు తిరుమల్, విశ్వనాథశర్మ, లలిత్, సురేష్, ప్రదీప్, రాకేష్‌లు ప్రత్యేక పూజలు చేశారు. జమ్మికుంట పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ అనుబంధ ఆలయమైన రామలింగేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరిసేడు గ్రామంలోని ఆపద్ధర సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు భక్తులు చేశారు. సాయంత్రం దేవాలయాల్లో దీపారాధన చేశారు. సైదాపూర్‌లో మహిళలు ఇళ్ల ఎదుట దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. వీణవంక మండలంలోని నర్సింగాపూర్‌లో హను మాన్ ఆలయంలో మహిళలు ఓంకారం రూపంలో వెలిగించిన దీపాలు వరుస ఆక ట్టుకుది. తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామంలోని శ్రీ వేంకటే శ్వర స్వామి రథోత్సవం వైభవంగా కొనసాగింది. శుక్రవారం ఈ రథోత్సవంలో భాగం గా నిర్వహించిన సత్య నారాయణ స్వామి వ్రతంలో ఎమ్మెల్యే సత్యనా రాయణ ప్రత్యేక పూజ లు చేశారు. ఎల్ఎండీ కాలనీలో గల శ్రీ మత్స్యగిరీంద్ర మహాదేవాలయంలో భక్తులు అభిషేకం చేశారు. గన్నేరువరం మండలం ఖాసింపేట గ్రామంలోని మానసాదేవి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయంలోని కోనేరులో ఉన్న జంటనాగులకు జలాభిషేకం నిర్వహించారు. చిగురుమామిడి మండలంలోని ఆలయాల్లో కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రామడుగు మండలంలోని దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


- **పలు ఆలయాల్లో..**

హుజూరాబాద్‌రూరల్: పట్టణంతో పాటు మండల వ్యాప్తం గా శుక్రవారం పలు దేవాలయాల్లో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంతో పాటు సిర్సపల్లిలోని శ్రీ రాజ రాజేశ్వరస్వామి ఆలయంలో దంపతులు సామూహిక వ్రతాలు ఆచరించారు.

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్ర స్వామి, ఎరడపల్లి ఆంజనే యస్వామి దేవాలయాల్లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. కేశవపట్నం, మొలంగూర్, తాడికల్, కొత్తగట్టు, మెట్‌పల్లి శివాలయాల్లో జలాభిషేకం, అర్చనలు చేశారు. ఆలయ చైర్మన్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రేణికుంటలో మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే


అలంకరించిన సీతారామచంద్రస్వామి వారు


నర్సింగాపూర్‌లో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు?

వీణవంక నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పక్కా సమాచారంతో శుక్రవారం పోలీసులు మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు యువకుల వద్ద సుమారు రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మండలంలోని ఆయా గ్రామాల్లో గంజాయి విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. మహారాష్ట్ర ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి గ్రామాల్లోని యువకు విక్రయిస్తున్నారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గెలుపోటములను ఆటగాళ్లు సమానంగా స్వీకరించాలి

రామడుగు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి అన్నారు. మండ లంలోని గడి కోట మైదానంలో శుక్రవారం చొప్పదండి కాంగ్రెస్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్ నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో గంగాధర జట్టుపై రామడుగు జట్టు విజయం సాధించింది. శుక్రవారం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పులి అంజనేయులుగౌడ్, మాజీఎంపీపీ గోపాల్‌గౌడ్, తేట క్రష్ణ, సీనియర్ నాయకులు మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


రామడుగు జట్టుకు బహుమతి అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి ఎమ్మెల్యేకు సన్మానం

ఇల్లందకుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఇంగిలే రామారావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉప్పల శ్రీనివాస్‌గౌడ్, గొడిశాల వరమేష్, మాజీఉప సర్పంచ్ మల్లేష్, సింగిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఎద్దు కిషన్‌రెడ్డి, ఎండీ లాల్, గాజుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌కు..

జమ్మికుంట రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియామకం అయిన పుల్లూరి స్వప్న-సదానందంను కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాచపల్లి జగన్, మహమ్మద్ షౌకత్ హుస్సేన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

జమ్మికుంట రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పట్టణ సీఐ వరంగంటి రవిశుమార్‌తో కలిసి హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. రైతుల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

వీణవంక నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన తాండ్ర హన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా కాంగ్రెస్ నాయకుడు కొమ్మిడి రాకేష్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించి క్వింటాల్ బియ్యాన్ని అందజేశారు. ఆయన వెంట నాయకులు నల్ల కొండాల్ రెడ్డి, ఎర్రబెల్లి వెంకటేష్, గంజ లక్ష్మీనారాయణ, రాకేష్‌రెడ్డి, సతీష్‌కుమార్, విద్యాసాగర్, శ్యామ్, మోహన్‌రెడ్డి, ప్రశాంత్, సమ్మయ్య, గట్టయ్య తదితరులు ఉన్నారు.

ప్రజా సంఘాల మండల కన్వీనర్‌గా తాళ్లపెల్లి తిరుపతిగౌడ్

చిగురుమామిడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంఘాల మండల కన్వీనర్‌గా జిల్లా కల్లు గీత కార్మికుల సంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి తిరుపతిగౌడ్‌ను ఎన్నిక చేసినట్లు శుక్రవారం ఎన్నుకున్నామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీలత తెలిపారు. తిరుపతిగౌడ్ మాట్లాడుతూ తన పై నమ్మకంతో ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.